## క్లుప్తంగా

### తెగుళ్ల నివారణపై అవగాహన



శ్రీరంగం గ్రామంలో నువ్వు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

టెక్కలి: నువ్వు పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉదయ్‌బాబు, శ్రీనివాస్, కె.త్రినాథ్‌స్వామి సూచించారు. శ్రీరంగం, తలగాం గ్రామాల్లో నువ్వు, వరి పంటలను బుధవారం పరిశీలించారు. నువ్వు పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి రంగారావు, ఏఈఓ సుమంత్, వీఏఏ సోని ఉన్నారు.

### ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బుధవారం ఆవిష్కరించారు. హాస్టల్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీబీసీ ఇ.అనురాధ, ఏఎస్‌డబ్ల్యూవో జి.బాలముకుందరావు, ఎంఈవో-1 ఎస్.శివరాంప్రసాద్, హాస్టల్ వార్డెన్ జి.రామారావు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీతారాంనాయుడు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన తులసీ బెహరాని మానసిక దివ్యాంగురాలు. ప్రతీ నెల వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన యువకులు హంగీర్ బెహరా, పాల్, యంగిచ్, జీటు, సోమేష విజయ్, కరుణాకర్ స్పందించారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని తులసీ బెహరాని తల్లి ఊర్మిళకి బుధవారం అందజేసి అండగా నిలిచారు.

### ప్రణాళిక తయారీలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: శిక్షణ పొందిన ఎన్యూమరేట ర్లు 2025-26 వార్షిక ప్రణాళిక తయారీలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ఇన్‌వాల్వ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జీవిబి దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక సెర్ప్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రుణాల మంజూరులో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పీడీ పి.కిరణ్‌కుమార్, ఏరియా కో-ఆర్డినేటర్ సీహెచ్ రామ్మోహనరావు, ఏసీఎం కె.సత్యన్నారాయణ, ఏపీఎం ప్రసాదరావు పాల్గొన్నారు.

### సంపద తయారీ కేంద్రం పరిశీలన

కంచిలి: కంచిలిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పంచాయతీ విస్తరణాధికారి కె.ఈశ్వరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్మీ కంపోస్టు అమ్మకాలు చేపట్టాలని, సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. షెడ్ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాంబాబు ఉన్నారు.

- పిచ్చిమొక్కలతో నిండిన బాహుదా చానెల్
- 2,200 ఎకరాలకు సాగునీరందని వైనం
- ఆందోళనలో రైతులు
- ఖరీఫ్ సమయానికి బాగు చేయాలని విజ్ఞప్తి



పిచ్చిమొక్కలతో నిండిన బాహుదా చానెల్

పంట కాలువలు ఇలా..

# సాగు ఎలా?

ఇచ్ఛాపురం:

అన్నదాతకు సాగు కష్టాలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరీ పెరిగాయి. ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన కాలువలను కనీసం పట్టించుకోవడం లేదు. పూడికలు, పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో పొలాలకు సక్రమంగా నీరు అందక..పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో 2,200 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన బాహుదా నదికి చెందిన కాలువ (బాహుదా చానెల్) అధ్వానంగా ఉండడంతో ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చానెల్ అధ్వానంగా ఉందని.. మరమ్మతులు చేయించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అయినప్పటికీ ఫలితం లేదు. గతంలో వచ్చిన తిత్లీ తుఫాన్ సమయంలో ఇది ధ్వంసమైంది. అప్పటి నుంచి దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. రైతులే చందాలు వేసుకొని బాగు చేయించుకుంటూ పంటలను సాగు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో బెల్లుపడ గ్రామ రైతులంతా సంబంధిత అధికారుల దృష్టికి చానెల్ పరిస్థితిని తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ చానెల్ పరిధిలో రత్తకన్న ప్రాంతానికి చెందిన 670 ఎకరాలు, ఏఎస్‌పేట, పురుషోత్తపురం గ్రామాలకు చెందిన 280 ఎకరాలు, బీమసముద్రం, బెల్లుపడ గ్రామాలకు చెందిన 1250 ఎకరాలు ఆధారపడి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రానున్న ఖరీఫ్ సీజన్ సమయానికైనా కాలువలను బాగు చేయించి సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

**అమలు కాని సీఎం హామీ**

ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాలకు సాగునీరందించే 11 ఓపెన్ హెడ్ చానెళ్ల పరిస్థితి సైతం దారుణంగా ఉంది. వీటిని కూడా బాగు చేయించాలని రైతులు వేడుకుంటున్నారు. ఇదే విషయాన్ని గత ఏడాది నవంబర్ నెలలో ఇచ్ఛాపురం మండలంలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా రూ.21 కోట్లు కేటాయిస్తున్నట్లు హామీచ్చారు. అయితే నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

### ప్రభుత్వమే ఆదుకోవాలి..



రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని పంట కాలువల గురించి పట్టించుకొనే వారు కరువయ్యారు. దీంతో చేసేదేమి లేక రైతులే చందాలు వేసుకొని కాలువలను బాగు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకుంది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి కాలువలను బాగు చేయించి రానున్న ఖరీఫ్ నాటికి బాహుదా నది నుంచి సాగునీరు సక్రమంగా అందజేయాలి.

-బుద్దెపు వెంకటస్వామి, రైతు, బెల్లుపడ గ్రామం

### సాగునీరు అందేలా చూడాలి



మున్సిపాలిటీ పరిధిలోని బెల్లుపడ గ్రామానికి చెందిన సుమారు 1250 ఎకరాల్లో పంటలు పండించాలంటే బాహుదా నది కాలువలే ఆధారం. పంట కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగించి ఆయకట్టుకు సాగు నీరందించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. వీటితో పాటు కొన్నిచోట్ల పంట భూములకు అనుసంధానం చేసిన పిల్ల కాలువలను కూడా బాగు చేయించాలి.

-నందిక పాపయ్య, రైతు, బెల్లుపడ గ్రామం

## క్రమశిక్షణను అలవర్చుకోవాలి



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

సంతబొమ్మాళి: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.చైతన్య అన్నారు. టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సత్ప్రవర్తనతో మెలిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, లక్ష్మీకాంతం, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, రాము, ఉమ, చిన్నారావు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, దయాసాగర్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి



హుద్‌హుద్ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: హుద్‌హుద్ ఇళ్లను మూడు నెలల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని హౌసింగ్ కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ జయరామ ఆచారి అన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులతో కలిసి సోంపేటలోని హుద్‌హుద్ ఇళ్లను బుధవారం పరిశీలించారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి మూడు నెలల్లో పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. బెంకిలి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్లను కూడా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈఈలు నర్సింగరావు, అప్పారావు, డీఈఈ సత్యాజి, ఏఈ రవిచంద్ర ఉన్నారు.

### మహానేతల ఉత్సవాలను విజయవంతం చేయాలి

పలాస: మహానేతల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు ఉర్నాన అప్పలరాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి, 11న మహాత్మాజ్యోతీరావుపూలే, 14న అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను కాశీబుగ్గలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కాశీబుగ్గ: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పలాస మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వసంతకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల వ్యాప్తంగా 427 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. ఇంటర్వ్యూలకు వచ్చేవారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులు, పాస్‌ఫొటోలను తీసుకురావాలన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: బీసీ రుణాల కోసం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. అన్ని ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులు వెంట తీసుకురావాలని సూచించారు.

పలాస: పలాస మండల పరిషత్ కార్యాలయంలో బీసీ రుణాల కోసం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వసంతకుమార్ తెలిపారు. ఉదయం పది గంటలకు దరఖాస్తుదారులు హాజరు కావాలని సూచించారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

సోంపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.





చెత్తతో ఉన్న ప్రదేశం





శుభ్రం చేసి క్లోరినేషన్ చేసిన తరువాత..

సాక్షి ఎఫెక్ట్...

## ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రి పరిసరాలను బుధవారం శుభ్రం చేశారు. ఆస్పత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యం క్షీణించడంతో రోగులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ సమస్యపై ఈ నెల ఒకటో తేదీన 'కంపు..కంపు'శీర్షికతో 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి స్పందించిన అధికారులు పరిసరాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేపట్టారు. రహదారిపైకి వాడుక నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు. హెడ్ నర్సులు వార్డులను పర్యవేక్షించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరుగుదొడ్లు, వార్డులను నిత్యం శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పరుపులపై బెడ్‌షీట్లు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని దిగువస్థాయి సిబ్బందికి ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు సూచించారు.





రోడ్డుపై వాడుక నీరు





నీరు రాకుండా శుభ్రం చేసిన తరువాత..

## సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని వినతి

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులు ఆదుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. పైడిగాం ప్రాజెక్ట్, గంగా సాగరం, ముకుంద సాగరం, బహుదానదిపై ఉన్న ఎత్తిపోతల పథకాలు, మహేంద్ర తనయ నదిపై బారువ గ్రోయన్, పొత్తంగి గ్రోయన్ మరమ్మతులకు గురవ్వడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని వివరించారు. ప్రభుత్వ విప్‌ను కలిసిన వారిలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, బీసీ సెల్ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వయిజర్ చౌదరి లక్ష్మణరావు, బీసీ సంఘం సభ్యులు గేదెల దేవరాజు, ఇరోతు శ్రీనివాస్, గుండ కృష్ణమూర్తి, తెప్పల నారాయణస్వామి, గార కృష్ణమూర్తి, దూగాన రామూర్తి, సీహెచ్ నీలయ్య ఉన్నారు.

## ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన ప్రదర్శనలో ఆర్టీసీ కార్మికులు

పలాస: పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు కోరారు. ఈ మేరకు పలాస ఆర్టీసీ డిపో మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన తెలియజేశారు. అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని, పదోన్నతులు కల్పించాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారానే కొనుగోలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్సు రూ.150 నుంచి నాలుగు వందల రూపాయలకు పెంచాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో గురు, శుక్రవారాల్లో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని నిర్ణయించారు.

## ఆటిజం పిల్లలను అశ్రద్ధ చేయొద్దు





సంతబొమ్మాళి: ర్యాలీలో పాల్గొన్న ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు సహిత విద్య ఉపాధ్యాయులు

మానసిక దివ్యాంగు (ఆటిజం) పిల్లలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అశ్రద్ధ చేయవద్దని అధికారులు అన్నారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రాల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య, భవిత కేంద్రాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీలు చేశారు. ఫిజియోథెరపి తల్లిదండ్రులకు పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పుట్టిన మూడు నెలల నుంచే సాధారణ శిశువులు తల్లిని గుర్తుపడతారని, అయితే ఆటిజం పిల్లల్లో చూపు, వినికిడి సమస్యతో పాటు జ్ఞాపికశక్తి తక్కువగా ఉంటుందని, మానసిక ఎదుగుదల ఉండదన్నారు. ఈ పరిస్థితిలో పిల్లలపట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు.

-సాక్షి నెట్‌వర్క్



టెక్కలి రూరల్: ర్యాలీ చేస్తున్న భవిత కేంద్రం సిబ్బంది



ఇచ్ఛాపురం టౌన్: భవిత కేంద్రంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు టి.శివకుమార్



కంచిలి: ఆటిజం అవగాహన ర్యాలీలో ఎంఈవో-1 శివరాంప్రసాద్ తదితరులు

## ఇంటి స్థలాల అక్రమాల విచారణకు అధికారి నియామకం

టెక్కలి: టెక్కలిలో తహసీల్దార్‌గా ఎల్.గరికివాడు, సీనియర్ అసిస్టెంట్‌గా కె.రామ్మోహన్‌రావు పని చేసిన కాలంలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాల్లో అక్రమాలపై విచారణ చేసేందుకు డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావును నియమిస్తూ సీసీఎల్ఏ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అప్పట్లో ఎన్‌టీఆర్ కాలనీ, మండాపాలెం కాలనీలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై ఇప్పటికీ అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో తహసీల్దార్‌గా పని చేసిన గరికివాడు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన రామ్మోహన్ రావు తహసీల్దార్‌గా ఉద్యోగ విరమణ చేశారు.

# ప్రయాణికుల పాట్లు



వేచివున్న ప్రయాణికులు

కాశీబుగ్గ: మండుతున్న ఎండల్లో సరైన సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడిన ఘటన పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరాల్సిన పలాస - విశాఖపట్నం ప్యాసింజర్ రైలు (67290) ఆలస్యమైంది. దీంతో అప్పటికే టిక్కెట్లు తీసుకుని సిద్ధంగా ఉన్నటువంటి ప్రయాణికులు నిరాశ చెందారు. కాగా అనంతరం అప్పటికప్పుడే ఆ రైలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో చేసేదేమీలేక అప్పుడే విశాఖపట్నం వెళ్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయాణికులు ఎక్కి అదనపు రుసుములు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైంది. కాగా మారలా మధ్యాహ్నం 3.00 గంటలకు పలాస - విశాఖపట్నం ప్యాసింజర్ పలాస రైలు నిలయం నుంచి బయల్దేరి వెళ్లింది. దీంతో అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు వేరే ట్రైన్లు ఎక్కి ఆపసోపాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. అందువలన ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులకు సరైన సమాచారం అందించడంతో పాటు ఖుర్దా డివిజన్ నుంచి తొలగించి ఆంధ్రాలోకి మార్చితే మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## విద్యార్థుల ప్రతిభ



విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పెరిటీ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ట్రిపుల్‌ఈకి చెందిన కె.వినోదిని, పి.పవిత్ర, జె.ప్రకాశ్, జె.తరుణ్ ప్రతిభ కనబరచి నగదు బహుమతి అందుకున్నారు. వీరిని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ డి.విజయకుమార్, ఏపీ ఎస్ఎస్‌డీసీ స్పోక్ బి.రామారావు, అధ్యాపకులు అశోక్, కె.కనకరాజు అభినందించారు.

-టెక్కలి

## ప్రవేశ పరీక్షపై అవగాహన



ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు జరగనున్న పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కంచిలి మండలంలోని మఠం సరియాపల్లి మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం అవగాహన కల్పించారు. ఓఎంఆర్ ప్రశ్నాపత్రం మోడల్, దాన్ని పూరించే పద్ధతులను వివరించారు. దరఖాస్తు చేసుకున్న 277 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఎంఈఓ-2 కె.చిట్టిబాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ పాల్గొనగా.. ఇన్‌స్ట్రక్టర్‌గా ఉపాధ్యాయుడు ఎస్.రవికుమార్ వ్యవహరించారు.

-కంచిలి

## ఘనంగా స్పోర్ట్స్ డే..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ పి.మధుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు రన్నింగ్, షాట్ బాల్, వాలీబాల్, త్రోబాల్ ఆడించారు. స్పోర్ట్స్‌డే ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు.

-కాశీబుగ్గ